నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 30 ఆగస్టు 2024 | MEDAK

ఫార్మాసిటీలోభూములు కోల్పోతున్న సంగారెడ్డి జిల్లా డప్పూర్ గ్రామ శివారులో సాగులో ఉన్న పాలాలు

పచ్చని పొలాలపై

ఫార్మా కంపెనీల పాగా..!

న్యాల్‌కల్, ఆగస్టు 29: చౌకగా భూములు, సరళతరంగా నిబంధనలు..ఇంకేముంది సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని పలు గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ఫార్మాసిటీ కోసం భూసేకరణలో వివాదాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల్లో ప్రభుత్వ, పట్టాభూములను సేకరించేందుకు సంబంధిత అధికారులు సర్వేలు పూర్తి చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత జిల్లా అధికారులు ఫార్మాసిటీకి కావాల్సిన భూసేకరణను గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏదిఏమైనప్పటికీ రానున్న రోజుల్లో ఇక్కడ ఫార్మా కంపెనీలు పాగా వేయడం ఖాయం. అదే జరిగితే పచ్చని పల్లెలు కాలుష్య కోరల్లో చిక్కుకోనున్నాయని ఆయా గ్రామాలకు చెందిన భూ బాధితులు, ప్రజలు, రైతులు ఆందోళన గురవుతున్నారు.

ఫార్మాసిటీ కోసం ప్రయత్నాలు ముమ్మరం..

న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో నిమ్జ్ ఏర్పాటుకు 12,635 ఎకరాలు సేకరించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో ఆయా మండలాల్లో ఇప్పటికే 3,600 ఎకరాల సేకరించింది. హైదరాబాద్ పట్టణానికి ఫార్మాసిటీ పరిశ్రమలు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని ఆయా గ్రామాలను ఎంపిక చేసింది. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని బీదర్ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో పాటు అక్కడ ఎయిర్‌పోర్టు, రైల్వేలైన్ అందుబాటులో ఉంది. ప్రస్తుతం ఫార్మాసిటీ ఏర్పాటు చేసే ఆయా గ్రామాల శివారు గుండా నిజాంపేట్-బీదర్‌కు జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫార్మాసిటీలో ఏర్పాటు చేసే ఔషధ కంపెనీలకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని ప్రభుత్వం గుర్తించింది. వివిధ ప్రాంతాలకు చెందిన ఔషధ కంపెనీలకు చెందిన పారిశ్రామిక వేత్తలు ఫార్మాసిటీలో పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఫార్మాసిటీ కోసం న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో 2,003 ఎకరాల భూసేకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మండలం లోని డప్పూర్ గ్రామ శివారులో 1465.25 ఎకరాలు, మల్గిలో 282.13 ఎకరాలు, వడ్డిలో 256 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సర్వే చేసి నివేదికలను సంబంధిత జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో భూసేకరణ చేపట్టేందుకు సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గెజిట్ నోటిఫికేషన్ జీవో పత్రాలను అతికించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములు ధరలు అధికంగా ఉండడంతో మారుమూల ప్రాంతమైన కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో చౌకగా ధరలకు లభించే భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కన్నేసింది. ఆయా గ్రామాల శివారులో అధిక మొత్తంలో ప్రభుత్వ భూములు ఉండడంతో భూసేకరణకు ఎలాంటి ఇబ్బందులు ఉం డావని భావించిన ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

పెరగనున్న కాలుష్యం.. కుంటుపడనున్న ఎవుసం

- ప్రమాదపు అంచున పచ్చని పొలాలు, నీటి వనరులు
- కనుమరుగు కానున్న గుట్టలు, కొండలు
- భూసేకరణకు ప్రయత్నాలు ముమ్మరం
- ఆందోళనలో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల భూ బాధితులు

ప్రమాదపు అంచున పచ్చని పొలాలు, నీటి వనరులు..

ఆయా గ్రామాల శివారు ప్రాంతంలోని పచ్చని పొలాల్లో ఏర్పాటు చేసే ఫార్మాసిటీతో పర్యావరణం, చెట్లు, చేమ, చెరువులు, కుంటలు, భూమి, మట్టి, నేల, గాలి వంటి అన్నిరకాల సహజ వనరులు కలుషితమై, భవిష్యత్తు తరాల ఉనికే ప్రశ్నార్థకంగా మారనున్నది. కిడ్నీ సమస్యలు, చర్మ వ్యాధులు, క్యాన్సర్‌తోపాటు అనేక వ్యాధుల బారిన పడాల్సిన దుస్థితి నెలకొంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పటన్‌చెరు, నర్సాపూర్, హత్నూర్, బుధేరా, దిగ్వాల్ ప్రాంతంలోని రసాయన కంపెనీలతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తమ గ్రామాలకు తప్పవన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీ వ్యర్థాలు విడిచిపెడితే చెరువులు, వాగుల్లోని నుంచి మండలం మీదుగా ప్రవహించే మంజీరా నదిలోకి చేరే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.గ్రామాల శివారులోని ఎత్తయిన గుట్టలు సైతం కనుమరుగుకానున్నాయి. ఆయా గ్రామాల శివారులోని గుట్టలపై నవనాథ్ సిద్ధలింగేశ్వరస్వామి, మల్లన్నస్వామి, ఫీర్‌గైబ్ సాహెబ్ దర్గాలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రానున్నారు. ఫార్మాసిటీలో ఆలయాలు కూడా కనుమరుగుకానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పేర్కొంటున్నారు. అందుకే ఫార్మాసిటీని అడ్డుకోవాలంటున్నారు.

ఫార్మాసిటీ ఏర్పాటుతో కనుమరుగు కానున్న సంగారెడ్డి జిల్లా మల్గి గ్రామ శివారులోని ఎత్తయిన గుట్టలు

ఫార్మాసిటీపై ఎంపీ సురేశ్ షెట్కార్‌కు రైతుల వినతి

కోహీర్, ఆగస్టు 29 : ఫార్మాసిటీ ఏర్పాటు చేసి రైతులకు అన్యాయం చేయొద్దని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జహీరాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కోసం వచ్చిన ఎంపీ సురేశ్‌షెట్కార్‌ను న్యాల్‌కల్ మండల డప్పూర్ రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండు వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు అధికారులు గెజిట్ విడుదల చేశారన్నారు. భూసేకరణతో పంట భూములు పోతాయని మొరపెట్టుకున్నారు. అసైన్డ్ భూముల రైతులకు మరింత అన్యాయం జరుగుతుందన్నారు. ఎలాగైనా ఫార్మాసిటీ కోసం చేపట్టిన భూసేకరణను నిలిపివేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఎంపీ రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఫార్మాసిటీకి భూములివ్వం..

ఫార్మాసిటీకి సారవంతమైన భూములు అసలే ఇవ్వం. హైదరాబాద్ ప్రాంత శివారులో ఏర్పాటు చేసే ఫార్మాసిటీని కర్ణాటక, తెలంగాణ సరిహద్దులోని పచ్చని పొలాలు, ఎత్తయిన గుట్టలు, ప్రకృతి రమణీయమైన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం సరికాదు. గుట్టుచప్పుడు కాకుండా సర్వేలు చేపట్టి బలవంతంగా భూమిని సేకరిస్తూ రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలి, లేనిపక్షంలో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం.

- రవీందర్, రైతు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, న్యాల్‌కల్ మండలం

గవర్నర్‌కు ఎమ్మెల్యే సన్మానం

సిద్దిపేట జిల్లా పర్యటనలో భాగంగా జనగామ జిల్లాను సందర్శించిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌కు ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు.

- చేర్యాల, ఆగస్టు 29

చెక్కుల పంపిణీ అడ్డుకోవడం సరికాదు

- పార్టీలకతీతంగా ప్రజా సంక్షేమానికి కృషి చేయాలి.. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- సంగారెడ్డి జిల్లా హత్నూరలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి జిల్లా హత్నూరలో తోపులాట మధ్య చెక్కులు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

హత్నూర, ఆగస్టు 29: ప్రొటోకాల్ పేరుతో చెక్కుల పంపిణీని అడ్డుకోవడం సరికాదని, ప్రొటోకాల్ పాటించడంలో ఎప్పుడూ ముందుంటానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం హత్నూర రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు స్టేజీపైకి ఎలా వెళ్తారని, కాంగ్రెస్ నాయకులకు, స్థానిక ఎంపీ రఘునందన్‌రావుకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమానికి కృషి చేయాలి తప్ప కార్యక్రమాన్ని అడ్డుకోవద్దని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రాక ఏడాది గడుస్తున్నదని, వచ్చిన చెక్కులను పంపిణీ చేయవద్దనడం సమంజసం కాదన్నారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న నాయకులకు నచ్చజెప్పి సజావుగా పంపిణీ జరిగేలా చూశారు. మరోపక్క చెక్కుల పంపిణీ సమాచారం ఇవ్వడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారంటూ లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు ఆరోపించారు. కొందరికి చెక్కుల పంపిణీ రోజూ ఉదయం సమాచారం ఇవ్వడంతో హడావిడిగా హాజరైనట్లు తెలిపారు. తోపులాట మధ్య చెక్కులు తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురైందని, చెక్కులు తీసుకుంటున్న క్రమంలో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారి స్వప్న, తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, నాయకులు పాల్గొన్నారు.

పట్టుబడిన అల్ఫాజోలం, గంజాయి దహనం

సంగారెడ్డి జిల్లా డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ ఆధ్వర్యంలో తగులబెట్టిన పోలీసులు

పటాన్‌చెరు పాశమైలారం మెడికేర్ పరిశ్రమకు తరలించిన మాదక ద్రవ్యాలు అల్ఫాజోలం, గంజాయి

సంగారెడ్డి/పటాన్‌చెరు, ఆగస్టు 29: సంగారెడ్డి జిల్లాలో పట్టుబడిన అల్ఫాజోలం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను పోలీసులు దహనం చేశారని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. గురువారం పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని మెడికేర్ పరిశ్రమలో ఇన్సినిరేషన్ ప్రక్రియతో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సీజ్ చేసిన మాదక ద్రవ్యాలను దహనం చేశామన్నారు. ప్రభుత్వ నిషేధిత అల్ఫాజోలం 13.990 కిలోలు, ఎండు గంజాయి 950.285 కిలోలను కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల సమక్షంలో కాల్చి బుడిద చేశారన్నారు. ప్రస్తుతం వాటి విలువ రూ.3.75కోట్లు ఉంటుందని, ఎన్‌డీపీఎస్ చట్టంలోని నియమ నిబంధనల ప్రకారం జిల్లాలో నిషేధిత పదార్థాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతోనే నిందితులు పోలీసులకు పట్టుబడుతున్నారన్నారు. కొందరు రాత్రికి రాత్రే డబ్బు సంపాదనపై మోజుతో అక్రమార్జనలో భాగంగా అల్ఫాజోలం తయారీ, గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పోలీసులతో విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు అదనపు ఎస్పీ సంజీవరావు, మెడికేర్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి, సంగారెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 29: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని, నచ్చిన క్రీడలో నిత్యం సాధన చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంత పాఠశాలల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు క్రీడా పాఠశాలకు ఎంపిక కావాలన్నారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థికి రూ.50 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు రూ. లక్ష నగదు బహుమతి అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో వ్యాయామ ఉపాధ్యాయుల ఖాళీలు ఎక్కడ ఉన్నా వెంటనే భర్తీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువుతోపాటు ఆటల్లోనూ నంబర్ వన్‌గా ఉండాలన్నారు. పట్టణంలోని మినీ స్టేడియాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, నాయకులు లింగమూర్తి, వెన్నరాజు, భాగ్యరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి పొన్నం

తండాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

హుస్నాబాద్, ఆగస్టు 29 : తండాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని అక్కన్నపేట రోడ్డులో జరిగిన గిరిజనుల తీజ్ ఉత్సవాలకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్యతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గిరిజనులు, మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. ఏపుగా పెరిగిన తీజ్‌లను గిరిజనులు మంత్రికి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేక విద్యకు దూరంగా ఉన్న తండాలు, గిరిజనులను గుర్తించి తండాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గిరిజన సంఘాల నాయకులతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అపరిచితులకు ఖాతా నంబర్లు ఇవ్వొద్దు

- సత్వర న్యాయానికి బ్యాంకర్లే కీలకం
- బ్యాంకర్ల సమావేశంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డిలో బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, ఆగస్టు 29: సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల అదుపునకు బ్యాంకర్ల సహకరం ఎంతో అవసరమని, గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాలు ఇవ్వొదని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ బ్యాంకర్లకు సూచించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో వివిధ బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను వినియోగించుకొని వివిధ రకాల నేరాలు పుట్టుకొస్తున్నాయన్నారు. సైబర్ నేరాలపై సత్వర న్యాయానికి బ్యాంకర్లే కీలకం కానున్నారని, పోలీసులకు బ్యాంకర్లు సహకరిస్తే బాధితులకు తగిన న్యాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని, ఫిజికల్ కాంటాక్ట్ లేకుండా యూపీఐ, బ్యాంక్ ఖాతాల ఆధారంగా సైబర్ నేరగాళ్లు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారన్నారు. అమాయక ప్రజలే టార్గెట్‌గా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి బ్యాంక్ సిబ్బంది దర్యాప్తు అధికారులకు సహకరించాలని, నేరానికి గురైన బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. కోర్టు అనుమతితో సైబర్ బాధితులకు చేరవలసిన డబ్బును ఖాతా లో జమ చేసి బాధితులకు అండగా నిలవాలన్నారు. సైబర్ బాధితులు కోల్పోయిన డబ్బు రీఫండ్ అయినప్పుడే వారిలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రతి బ్యాంక్‌లోనూ హై రిసల్యూషన్ కలిగిన సీసీ కెమెరాలను బ్యాంక్ లోపల, బయట, ఏటీఎంలలో అమర్చాలన్నారు. అనవసరమైన లింక్‌లను, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దని, ఆన్‌లైన్‌లో అపరిచితులకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930కి కాల్ గానీ లేదా www.cybercrime.gov.in లో రిపోర్ట్ చేయాలని సూచించారు. డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మొదలైన వలసలు

నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నుంచి వంద మంది చేరిక

కంగ్టి మండలం జీర్గి తండాలో గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి, ఆగస్టు 29: బీఆర్ఎస్‌లోకి వలసలు మొదలయ్యాయి. గురువారం సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం జీర్గి తండాకు చెందిన 100 మంది బీజేపీ కార్యకర్తలు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వేర్వేరు కావని, అందుకే బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పంట పెట్టుబడి కోసం రైతులు బయట నుంచి వడ్డీకి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రంఛన్‌గా రైతుల ఖాతాల్లో రైతుబంధు జమయ్యేవన్నారు. ఇప్పుడు రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని వెల్లడించారు. చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ అర్చనాకిరణ్, సురేశ్, కిషన్, జగదీశ్, విఠల్, సోమ్లా, సంతోశ్, సుధాకర్, పుండ్లిక్, గోపాల్, చందర్, తారాసింగ్, హరిసింగ్, ధాకు, సుభాశ్, దేవిదాస్, రాంరావు, జైపాల్, రమేశ్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అరకొర పంట రుణమాఫీ !

- ఒకే కుటుంబంలో రూ.2లక్షలకు పైన ఉంటే మాఫీ కాలేదు
- బ్యాంకులు, రైతు వేదికల వద్ద బారులు తీరుతున్న రైతులు
- పంట రుణమాఫీ కోసం రైతన్నల ఎదురు చూపులు
- ఇదీ సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో పరిస్థితి

పుల్కల్, ఆగస్టు 29 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు రూ.2 లక్షలలోపు పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే మొదటి విడతలో రూ.లక్షలోపు, రెండో విడతలో రూ.లక్షన్నరలోపు ఉన్న రైతులకు పంట రుణమాఫీ అయినప్పటికీ మూడో విడతలో రూ. 2 లక్షలలోపు ఉన్న రైతులకు ఇబ్బందులు తప్పలేదు. ఒకే కుటుంబంలో రూ. 2 లక్షల కన్నా ఎక్కువ ఉన్నా వారికి రుణమాఫీ వర్తించలేదు. దీంతో బ్యాంకులు, రైతుల వేదికల వద్దకు కర్షకులు పరుగులు తీస్తున్నారు. రుణమాఫీ ఎందుకు కాలేదని బ్యాంకు అధికారులను అడిగితే తమకు తెలియదని, వ్యవసాయాధికారులను సంప్రదించాలని సమాధానాలు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రూ.2 లక్షలలోపు పంటరుణమాఫీ చేస్తదనే ఆశతో ఎదురు చూసినప్పటికీ కొర్రీలు పెట్టి రేషన్‌కార్డును ప్రమాణికంగా తీసుకోవడంతోనే అనర్హులుగా మిగులుతున్నామని కొంత మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు వేదికల వద్దకు అన్నదాతలు పరుగులు

రూ.2లక్షలలోపు పంట రుణమాఫీ అవుతదేమోననే ఆశతో రైతులు పట్టాపాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని ఏఈవోల వద్దకు వెళ్తే మీకు సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకొని వస్తే ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెబుతున్నారు. ఈ విషయం తెలియడంతో పంట రుణమాఫీ కాని రైతులు రైతు వేదికల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఏఈవోలు సంబంధిత పత్రాలను స్వీకరిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా పుల్కల్ గ్రామ వ్యూ

సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో..

రూ. 2 లక్షల లోపు పంట రుణమాఫీ కాని రైతులు సంగారెడ్డి జిల్లా పుల్కల్ లోనే 513 మంది ఉండగా ఇందులో 281 మందికి సంబంధించి రూ. 2 కోట్ల 3 లక్షల 90వేల 389 మాత్రం పంట రుణమాఫీ అయ్యింది. మిగతా 232 మందిలో కొంత మంది రైతులు అర్హులుగా ఉన్నప్పటికీ రేషన్‌కార్డు ప్రమాణికంగా తీసుకోవడంతో పంట రుణమాఫీ కాలేదు. ఒక కుటుంబం లో ఇద్దరు, ముగ్గురు రూ. 2 లక్షలకు పైగా పంటరుణాలు తీసుకున్నారు. దీంతో వారు పంట రుణ మాఫీకి అనర్హులుగా మిగిలారు.

రైతులను మోసం చేయొద్దు

నాకు బిలాల్‌పూర్‌లో 1.10 ఎకరాల భూమి ఉన్నది. గ్రామంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ. లక్షా క్రాప్‌లోన్ ఉన్నది. మా ఇంటి యజమాని పేరు మీద కూడా 3.15 ఎకరాల భూమి ఉన్నది. ఆయనకు రూ. 1.56 లక్షల అప్పు ఉన్నది. ఇద్దరికీ కలిపి రూ.2.56 లక్షల అప్పు అయ్యింది. దీంతో పంట రుణమాఫీ కాలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు రెండు లక్షలలోపు పంట రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రైతులందరికీ ముందుగా రూ.2 లక్షలను బ్యాంకులో జమచేయాలి. ఆ తర్వాత బ్యాంకులో మిగతా డబ్బులు చెల్లిస్తాం. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయొద్దు.

- ఇందిరారాణి, మహిళా రైతు, బిలాల్‌పూర్, కోహీర్ మండలం

అధైర్య పడొద్దు.. ఇంటింటికీ వస్తాం

రూ. 2 లక్షలలోపు పంట రుణమాఫీ కాని రైతులెవరూ అధైర్యపడొద్దు. ఎందుకు రుణమాఫీ కాలేదో.. మీ ఇంటి వద్దకే వచ్చి పత్రాలను పరిశీలించి నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తాం.. అందుకు రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే సంప్రదించాలి.

- చైతన్య, వ్యవసాయాధికారి, పుల్కల్ మండలం, సంగారెడ్డి జిల్లా